రైతును రాజు చేయడమే లక్ష్యం



భూపాలపల్లి రూరల్: చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



చల్లగరిగలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

● ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: రైతును రాజు చేయడమే ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మండలం కొంపల్లి, గూడాడ్‌పల్లి, గొర్లవీడు నేరేడుపల్లి, వజినపల్లి గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలతో దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న పంటల రైతులకు నష్టపరిహారం చెక్కులతోపాటు పలువురి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. రైతు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బంధు, రైతు బీమా, 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం గూడాడ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రాంభించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ కల్లెపు శోభ రఘుపతి రావు, ఎంపీపీ మందల లావణ్య సాగర్ రెడ్డి, డీఎస్పీ రాములు, సీఐ రాంనర్సింహారెడ్డి, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు విజయ్ భాస్కర్, సంజీవరావు, సునీల్, మండల పార్టీ అధ్యక్షుడు పిన్‌రెడ్డి రాజిరెడ్డితోపాటు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

చిట్యాల: ప్రతి పేదవారికి వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చల్లగరిగ గ్రామంలో రూ.20లక్షల నిధులతో హెల్త్ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హెల్త్ సబ్ సెంటర్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో నూతన వైద్య కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా 23 మంది సూపర్ స్పెషాలిటి డాక్టర్లు నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్రె సాగర్, ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, ఒడితల పీహెచ్‌సీ డాక్టర్ మౌనిక, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ కుంభం క్రాంతి కుమార్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు రాజేందర్ గౌడ్, మేరుగు సంపత్, స్థానిక సర్పంచ్ కర్రె మంజుల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి



పలిమెల: మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి



మహాముత్తారం: మాట్లాడుతున్న శంకర్‌నాయక్

పలిమెల: స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా గ్రామాల్లో గుర్తించిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాకాలం రాకముందే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఓ సునీత, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇంకుడు గుంతలకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శంకర్‌నాయక్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈజీఎస్‌సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు మండలంలోని యామన్‌పల్లి, కొర్లకుంట గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీఓ శ్రీనివాస్‌రావు, ఏపీఓ ప్రసాద్, ఈసీ శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.

రాజ్యాంగ గ్రంథం ఇవ్వాలని వినతి

వాజేడు: భారత రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ సయ్యద్ సర్వర్‌కు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగాన్ని పౌరులకు ఇస్తే అందులోని అంశాలు అందరికి తెలుస్తాయని తెలిపారు. సామాన్య ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని సూచించారు. చెన్నంరాజు, ఇల్లెందుల రాజు, పవన్, విజయ్, సందీప్‌తో పాటు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆధార్ సెంటర్ ప్రారంభం



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ భూక్య విజయ్ కోరారు. గురువారం కారల్‌మార్క్స్‌కాలనీలోని పోస్టాఫీసులో ఆధార్ సెంటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు, నవీకరణ కోసం ప్రత్యేక సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌పోస్ట్ మాస్టర్ ఖలీల్ పాషా, సిబ్బంది మన్మోహన్ శర్మ, ఆధార్ యూజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



మల్హర్: మండలంలోని అడ్వాలపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి లక్ష్మణ్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సర్జరీ ఖర్చుల కోసం పెద్దపల్లి జెడ్పీ చైర్‌పర్సన్ పుట్ట మధును కుటుంబ సభ్యులు సంప్రదించగా సీఎం సహాయనిధి ద్వారా రూ.75వేలు మంజూరు చేయించాడు. ఈ మేరకు మధు తనయుడు పుట్ట శ్రీహర్ష గురువారం ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితుడికి అందజేశారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామానికి చెందిన చిట్యాల సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతు చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, భూపాలపల్లి జెడ్పీచైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిల దృష్టికి పలుగుల బీఆర్ఎస్‌పార్టీ నాయకుడు బర్ల కుమార్ తీసుకువెళ్లాడు. వారి ఆదేశాలతో రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం యువనాయకుడు పుట్ట శ్రీహర్ష బాధిత కుటుంబానికి నిమ్స్ ఆస్పత్రిలో అందజేశారు.

నియామకంపై హర్షం


చిట్యాల: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గంలో మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన అజ్మీరా రాజు నాయక్‌కు అవకాశం కల్పించిన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చల్లగరిగ గ్రామస్తుడిని నియమించడం సంతోషకరమని ఆపార్టీ నాయకులు కోడెల భద్రయ్య, మోకిరాల జనార్దన్‌రావు, దూడపాక సాంబయ్య, కొత్తూరి జయపాల్, సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు



టేకుమట్ల: మండలంలోని రామక్రిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన అప్పని కొమురయ్య, కుంభం పోశాలు, ఎంబాడి పోశాలు, గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన తిప్పారపు రమేష్‌బాబు గుడుంబా విక్రయిస్తుండగా అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై చల్ల రాజు గురువారం తెలిపారు. గ్రామాల్లో గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎదుట వారిని బైండోవర్ చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య



టేకుమట్ల(రేగొండ): ఒంటరి తనాన్ని భరించలేక వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రేగొండ మండల కేంద్రంలోని గాడిపల్లి శివారులో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గాడిపల్లికి చెందిన అట్టెం మల్లయ్య(75)కు ఇద్దరు కుమార్తెలు కాగా వారికి వివాహం చేయగా చిన్న కూతురు, ఆమె భర్త ఇద్దరు మృతిచెందారు. గతంలోనే భార్య సైతం మృతి చెందడంతో చిన్న మల్లయ్య పూరిల్లు ఏర్పాటు చేసుకుని ఉండేవాడు. వృద్ధాప్యం, ఒంటరి తనంతో తీవ్ర మనస్థాపానికి గురై గ్రామ శివారులోని శ్మశాన వాటికలో అతడి వద్ద ఉన్న రూ.1,650లను పక్కన పెట్టి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు బంధువులు, పోలీసులకు సమాచారాన్ని అందించారు. పెద్ద కూతురు మండల కొమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

టేకుమట్ల(రేగొండ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన రేగొండ మండలంలోని రేపాకలో గురువారం చోటుచేసుకుంది. రైతు బోయిని రాజయ్య కథనం ప్రకారం .. తనకున్న 5 ఎకరాల వ్యవసాయ భూమిలో ఇటీవల ఆయిల్ పామ్ పంటను సాగు చేస్తూ అంతర్ పంటగా మొక్కజొన్న వేసినట్లు తెలిపారు. పంటను కోతకోసిన అనంతరం ఇంటికి తరలించే తరుణంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగి పడటంతో మంటలు చెలరేగి మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైందన్నారు. అలాగే ఐదు ఎకరాల్లోని ఆయిల్ పామ్ పంట సైతం పూర్తిగా అగ్నికి ఆహుతైందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లిందని ప్రభుత్వమే అన్ని విధాల ఆదుకొని పరిహారం అందించాలని కోరారు.

ప్రభుత్వ అసమర్థతతోనే రైతులకు కష్టాలు

● ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం: ప్రభుత్వ అసమర్థత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించడానికి కష్టాలు పడుతున్నారని మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని గారెపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ధాన్యం నిల్వలు, కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ముఖ్యమంత్రి, మంత్రులు చెప్పిన మాటలు క్షేత్ర స్థాయిలో అమలుకావడం లేదని అన్నారు. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం కేంద్రాలకు తీసుకొచ్చి రోజుల తరబడి పడిగాపులుకాస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయం అని పేర్కొన్నారు. టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో ధాన్యం కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలుపడుతున్నారని పేర్కొన్నారు. తరుగుపేరిట కోతలు విధిస్తూ రైతులను మోసం చేస్తున్నారని అన్నారు. రైతులు ధాన్యం విక్రయించిన వెంటనే ట్రక్‌షీట్ ఇవ్వాలని, తడిసిన ధాన్యానికి మద్దతు ధర అందించాలని, ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు కారెంగుల తిరుపతిగౌడ్, మంత్రి విజయరాజు, చీమల వెంకటస్వామి, కొట్టె శ్రీహరి, చీమల రాజు, కొట్టె ప్రభాకర్, తిరుపతియాదవ్, మేడిపల్లి కిరణ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎంపీపీ మల్లారెడ్డి

టేకుమట్ల: మండల అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రామక్రిష్టాపూర్ (టి) గ్రామంలోని విద్యావనరుల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. కంటి వెలుగు విజయవంతానికి కృషి చేసిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశాజ్యోతి, వైద్య సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రైతులను పట్టించుకోని ప్రభుత్వం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

వెంకటాపురం(ఎం): రైతులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ములుగు ఎమ్మెల్యే సీతక్క రైస్ మిల్లర్లపై ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని కేశవపూర్ గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీతక్క పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవాటానికి తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల చేతిలో అన్నదాతలు దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ధాన్యం తేమ శాతం ఎక్కువగా ఉందన్న సాకుతో, తరుగు పేరుతో క్వింటాలుకు 10 కేజీల నుంచి 12 కేజీల వరకు కోతలు విధిస్తూ అన్నదాతలను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ఒకవైపు వడగండ్ల వానలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోగా, మరో వైపు పంటలను అమ్ముకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కలెక్టర్ ఇప్పటికైనా చొరవ తీసుకొని మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలులో తరుగు లేకుండా కొనుగోలు చేసేలా చూడాలని లేనిపక్షంలో రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మండలంలోని కేశవపూర్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన కోడారి పర్వతాలు, దేవసందుల లక్ష్మి కుటుంబాలను ఎమ్మెల్యే సీతక్క పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే సీతక్క అందజేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు దాటిన తర్వాతనే ఆడపిల్లలకు వివాహం చేయాలని సూచించారు. ఎంపీపీ బుర్ర రజిత, జెడ్పీటీసీ రుద్రమదేవి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయాలపాలైన సమ్మయ్య

మొగుళ్లపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన రంగాపురం గ్రామ శివారులో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం చిట్యాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు పరకాల వైపు నుంచి మద్యం మత్తులో ఆటో తోలుకుంటూ మొగుళ్లపల్లి వైపు అతివేగంతో వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎక్సెల్ బైక్‌పై మొగుళ్లపల్లి నుంచి వస్తున్న పరకాల మండలం నాగారానికి చెందిన చిరు బట్టల వ్యాపారి రాజ సమ్మయ్యను ఢీకొట్టారు. దీంతో సమ్మయ్య రోడ్డు పక్కన ఉన్న పొలాల్లో ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీధర్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వెంకటాపురం(కె): కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించనున్న సీపీఐ ప్రజా గర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జునరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ప్రజా గర్జన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసనగా సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు ప్రజలు, మేధావులు, యువకులు, తరలిరావాలన్నారు.

మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

పలిమెల: కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల అధ్యక్షుడిగా పంకెన గ్రామానికి చెందిన పాగె పొట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా పాగె సంతోషలు ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం దేవేందర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో ఈ మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా జనగామ సూరిబాబు, కలుగూరి దిలీప్, కుమ్మరి తిరుపతి, సహాయ కార్యదర్శులుగా కలుగూరి సమ్మయ్య, కలుగూరి సడవలి, కోశాధికారిగా కుమ్మరి సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా పాగె మోహన్, కార్యవర్గ సభ్యులుగా అనపర్తి సంజీవ్, పాగె రామయ్య, జాడి భాస్కర్, కోడి శ్రీరాములు, రాజయ్య, సడవలి, భాస్కర్, రాజులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఓడబలిజల సంక్షేమానికి కృషి చేయాలి



ఏటూరునాగారం: జెండా ఆవిష్కరణలో పాల్గొన్న గారపోశాలు, నాయకులు

ఏటూరునాగారం: ఓడబలిజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి గార పోశాలు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓడవాడలో ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను పోశాలు ఆవిష్కరించి మాట్లాడారు. మత్స్య వృత్తి చేసుకునే వారికి పక్కా భవనాలు, వాహనాలు, పడవలు ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులు అందజేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్ల అరుణ, బోట తిరుపతమ్మ, అంగల వీరన్న, సుగందపు నర్సింహులు, పానెం సాంబశివరావు, రాందాస్ సత్యనారాయణ, బోట రమణయ్య, ఎర్రల్ల రమేష్, గార ఆంజనేయులు, దర్ర హరికృష్ణ, పానెం నాగేశ్వర్‌రావు, రాందాస్, ముత్తేష్, గార మహేష్, సత్యం, సంతోష్, చందు, వెంకటేష్, రాములు, రాందాస్, పోతురాజు, రాందాస్, వెంకటేష్, నర్సమ్మ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలోని శివాలయం సెంటర్‌లో, వీఆర్‌కేపురం గ్రామంలో గురువారం నిర్వహించారు. సంఘం జెండాను రాష్ట్ర నాయకుడు దర్రా దామోదర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఓడబలిజల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సునీల్, కన్నయ్య, సమ్మయ్య, శ్రీకాంత్, రమేష్, శివరాణి, నర్సింహారావు, రాంబాబు, వెంకటేశ్వర్లు, రవి ఉన్నారు.

వాజేడు: ఓడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో నిర్వహించారు. ఓడ బలిజ సేవా సంఘం నాయకులు జెండాను ఎగురవేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటవీనాజీపేట గ్రామంలో బొడ్రాయితో సహా శ్రీలక్ష్మి భూలక్ష్మి దేవతలను నెలకొల్పి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గంట ఉమాదేవెందర్‌రెడ్డి మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సిరికొండ

చిట్యాల: మండలంలో వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి గురువారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజీరమ్మతో పాటు గిద్దెముత్తారం, అందుకుతండా, బావుసింగ్‌పల్లి గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. అనంతరం శాంతినగర్‌లో వారం రోజుల క్రితం అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దానవేన తిరుపతి, చింతకింది దశరథం కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆర్డీఓకు సంఘటనను వివరించి తక్షణమే ప్రభుత్వం ద్వారా అందించే ఆర్థిక సాయం, సామగ్రిని ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కాట్రేవుల సాయిలు, జడల్‌పేట, అందుకుతండా గ్రామాల సర్పంచ్‌లు రత్నాకర్ రెడ్డి, సిద్ధంకి భాస్కర్, నాయకులు చింతల రమేష్, జెన్నె యుగందర్, పువ్వాటి హరికృష్ణ, కన్నబోయిన అశోక్, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, రాయిని శ్రీకాంత్, కోడెల రాజమల్లు, నందయ్య, వేణువంక శ్రీదేవి, పులి అంజిరెడ్డి, సంజీవ్, బుర్ర రవి, వెంకట్ నాయక్, సంగ రాజేందర్, భూక్య మోహన్, ముల్కోజ్ సమ్మయ్య, నందు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్



అరెస్టు చూపుతున్న ఎస్సై షాఖాన్

చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామ శివారులో గల తాటివనంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై ఎండి. షాఖాన్ గురువారం తెలిపారు. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కంచు తిరుపతి, గోపగాని కుమారస్వామి, కంచర్ల నాగరాజు, కంచర్ల మధు, నగరం పోచాలు, జన్నే సురేష్‌లను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, 5 సేల్ ఫోన్లు, 3 ద్విచక్రవాహనాలు, రూ.24వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది సురేందర్, సిద్దార్థ, అస్లాం జానీ, తదితరులు పాల్గొన్నారు.